సాక్షి
అనంతపురం
మంగళవారం । 6 । మే । 2025



వాడిపోతున్న జల పుష్పాలు

భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. నీటి వనరులు వేడెక్కిపోతుండటంతో జల పుష్పాలు విలవిలలాడిపోతున్నాయి. 8లో



చీనీ టన్ను రూ.24,100

అనంతపురం మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.24,100 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ ఫలితాల విడుదల



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఏప్రిల్‌లో నిర్వహించిన బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ, ఎంసీఏ మూడో సెమిస్టర్ (ఆర్–21)సప్లిమెంటరీ, ఎంబీఏ మూడో సెమిస్టర్ (ఆర్–21) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను యూనివర్సిటీ వెబ్ సైట్‌లో చూడాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి.నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ ఎస్.శ్రీధర్, డాక్టర్ అంకారావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క వీరంగం

- 15 మందికి గాయాలు



తీవ్రంగా గాయపడిన దేవాన్ష్

పుట్లూరు: మండల కేంద్రం పుట్లూరులో ఆదివారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. రాత్రి ఆరుబయట నిద్రిస్తున్న వారిపై దాడి చేసి గాయపరిచింది. సాయంత్రం వేళలోనూ ఇద్దరు చిన్నారులను పిచ్చికుక్క కరిచింది. దాదాపు 15 మంది గాయపడ్డారు. బాధితులకు తాడిపత్రి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించారు. బాధితుల్లో దేవాన్ష్ అనే నాలుగేళ్ల బాలుడితో పాటు హరిప్రసాద్, నరేంద్ర, ఎల్లమ్మ, అంకన్న, నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

నేడు ఏపీ ఈసెట్



వివరాలు వెల్లడిస్తున్న ఏపీ ఈసెట్ చైర్మన్ సుదర్శనరావు

అనంతపురం: డిప్లొమా విద్యార్థులు లేటరల్ ఎంట్రీ కింద బీటెక్ సెకండియర్‌లో ప్రవేశం పొందేందుకు ఏపీ ఉన్నత విద్యామండలి, జేఎన్‌టీయూ అనంతపురం ఆధ్వర్యంలో మంగళవారం ఏపీ ఈసెట్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏపీఈసెట్ చైర్మన్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య సోమవారం సాయంత్రం జేఎన్‌టీయూ అనంతపురం పాలకమండలి భవనంలో మీడియాకు వెల్లడించారు. ఏపీ ఈసెట్‌కు మొత్తం 35,187 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఏపీలో 109, తెలంగాణలోని హైదరాబాద్‌లో ఒక కేంద్రంలో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నిర్దేశించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్, డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, ఐడెంటిటీ కార్డు తీసుకెళ్లాలని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదన్నారు.

సూర్యప్రభ వాహనంపై లక్ష్మీ చెన్నకేశవుడు



ధర్మవరం అర్బన్: లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామి వారి భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రి చంద్ర ప్రభ వాహనంపై స్వామిని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మంగళవారం సర్వభూపాల, సింహ వాహనాల్లో స్వామి వారు దర్శనమివ్వనున్నట్లు ప్రధాన అర్చకులు కోనేరాచార్యులు తెలిపారు.

ఏదీ రియల్ కాదు

ప్రభుత్వ ప్రకటనతో సంబంధం లేదు. తమ భూముల విలువ పెంచుకోవడం కోసం నోటికొచ్చిన అబద్ధాలు చెబుతున్నారు. ఆకర్షణీయమైన బ్రోచర్లతో అరచేతిలో వైకుంఠం చూపించేస్తున్నారు. ఆలసించినా ఆశాభంగం అని తొందరపెడుతున్నారు. అమాయకులు నిజమని నమ్మి.. సంపాదించుకున్న డబ్బుతో పాటు.. వడ్డీకి తీసుకున్న సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారులను సంప్రదించి ప్లాట్లు కొంటున్నారు. రోజులు గడిచే కొద్దీ రియల్టర్లు చెప్పిన మాటలు ఉత్తివే అని తెలిసి భారీగా నష్టపోయామని లబోదిబోమంటున్నారు.



- అనంతపురంలో ఎయిర్‌పోర్ట్ వస్తోందని ప్రచారం
- కూడేరు ప్రాంతంలో నేడో రేపో ఫ్లైట్‌లు దిగుతాయని లీకులు
- పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ వెంచర్ ఓనర్లు కరపత్రాలతో మార్కెటింగ్
- బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారి 6 లేన్లు అవుతుందని మరో ప్రచారం
- ఇప్పటివరకూ ఆరు లేన్ల ప్రతిపాదనే లేదంటున్న జాతీయ హైవే అథారిటీ
- ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై ఇప్పటివరకూ సంప్రదింపులే జరగలేదన్న కలెక్టర్
- నమ్మించి నట్టేట ముంచడానికి యత్నిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురానికి ఎయిర్‌పోర్ట్ వస్తోందని, అతి కొద్ది నెలల్లోనే ఫ్లైట్‌లు దిగుతాయని జరుగుతున్న ప్రచారం సామాన్యులను విస్మయ పరుస్తోంది. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేస్తున్న ఈ ప్రచారం మాయలో పడి చాలామంది భూములు, ప్లాట్లు అధిక ధరలకు కొని తీవ్రంగా నష్టపోతున్నారు. వందల ఎకరాల భూములు కొన్న స్థిరాస్తి పెట్టుబడిదారులు దానిని సొమ్ము చేసుకునేందుకు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఉదయాన్నే కాలేజీలు, ప్లే గ్రౌండ్‌లు, పార్కుల వద్దకు వచ్చే వాకర్స్‌కు కరపత్రాలు పంచుతున్నారు. దానిపై ఎయిర్‌పోర్ట్ డిజైన్‌తో పాటు హైవే దూరం, ప్లాట్ల లేఅవుట్ వంటివన్నీ చూపిస్తోంటే చాలామంది నిజమేనేమో అని నమ్మేస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్ పేరుతో

కూడేరు మండల కేంద్రం జిల్లా కేంద్రం అనంతపురానికి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ మార్గంలో తలుపూరు, సజ్జల కాల్వ, బాపనపల్లె గ్రామాల్లో సుమారు 1,500 ఎకరాలు సేకరిస్తున్నారని, ఇక్కడ ఎయిర్‌పోర్టు ఖరారైందని రియల్ ఎస్టేట్ వాళ్లు చెబుతున్న కహానీ. ఇదంతా ప్రైవేటు భూమే. ఎకరాకు కనీసం రూ.30 లక్షలు ధర చెల్లించినా భూమికే రూ.450 కోట్లు చెల్లించాలి. కనీసం వంద ఎకరాలు ప్రభుత్వ భూమి లేకుండా ఎయిర్‌పోర్ట్ సాధ్యమా అన్నది నిపుణుల మాట. రోజుకో ప్రచారంతో ఆ ప్రాంత రైతులు భయాందోళన చెంది, తమ భూములు ఎయిర్‌పోర్టుకు ఎక్కడ లాక్కుంటారోనని ఏకంగా జాయింట్ కలెక్టర్‌ను కలిశారు. ఇదంతా నిజం కాదని, మీరు అలాంటివేవీ నమ్మొద్దని చెప్పి పంపించారు.

ఆరులేన్ల రహదారి పేరుతోనూ...

ప్రస్తుతం బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారి నాలుగు లేన్లుగా ఉంది. ఈ రహదారిని ఆరులేన్ల రహదారిగా చేస్తున్నారంటూ కొందరు ప్రచారం మొదలుపెట్టారు. దీంతో చాలామంది చిన్న చిన్న పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. కానీ జాతీయ హైవే అథారిటీ అధికారులు మాత్రం అలాంటి ప్రతిపాదనే లేదని చెబుతున్నారు. జాతీయ రహదారి ఆనుకుని కొడికొండ నుంచి గుత్తి వరకు వందల ఎకరాల్లో వెంచర్లు వేసిన బడా పెట్టుబడి దారులు చేస్తున్న దుష్ప్రచారంతో సగటు మదుపరులు నష్టపోతున్నారు. ఎయిర్‌పోర్టు, రహదారి వెడల్పు పనులు అయ్యాక ధరలు పెరిగిపోతాయని, ఇప్పుడు కొనుక్కుంటే చౌకగా లభిస్తాయని నమ్మబలికిస్తున్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్ గూగుల్ లొకేషన్ అంటూ ఫ్లెక్సీల్లో వేసి చూపిస్తున్నారు. దీంతో చిరు వేతనజీవులు ఆయా ప్రాంతాల్లో ప్లాట్లు కొనుక్కుని నిండా మునిగిపోతున్నారు. రియల్ ఎస్టేట్ పెట్టుబడి దారులంతా టీడీపీ నేతలే ఉండటం గమనార్హం.

ఇప్పటివరకూ సంప్రదింపులే లేవు



అనంతపురం జిల్లాలో ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి ఎలాంటి సంప్రదింపులూ లేవు. ప్రభుత్వం నుంచి గానీ, ఏవియేషన్ కార్పొరేషన్ నుంచి గానీ మాకు సమాచారం లేదు. ప్రభుత్వం నుంచి సమాచారం వస్తేనే దీనిపై ముందడుగు పడుతుంది.

–డాక్టర్ వినోద్‌కుమార్, కలెక్టర్

9న ఉరవకొండకు సీఎం రాక



ఛాయపురం వద్ద మాట్లాడుతున్న మంత్రి కేశవ్

ఉరవకొండ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన ఖరారైంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉరవకొండలో సీఎం పర్యటించనున్నట్లు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్యపన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సోమవారం వజ్రకరూరు మండలం ఛాయపురంలో ఆయన సీఎం పర్యటన వివరాలను మీడియాకు వెల్లడించారు. హంద్రీ–నీవా కాలువ సామర్థ్యాన్ని పెంచేందుకు చేపడుతున్న కాలువ వెడల్పు పనులను సీఎం పరిశీలిస్తారన్నారు. ఇప్పుడొస్తున్న నీటిని రెట్టింపుస్థాయిలో తీసుకొచ్చే విధంగా ఆరు పంపులను 12 పంపులకు పెంచనున్నట్లు తెలిపారు. సీఎం పర్యటన కోసం రాగులపాడు, లత్తవరం, ఛాయాపురం ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. 9వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పర్యటన ఉంటుందన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

హంద్రీ–నీవా కాలవ విస్తరణ పనులను పరిశీలించేందుకు త్వరలో సీఎం చంద్రబాబు ఉరవకొండ ప్రాంతంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఎస్పీ జగదీష్ సోమవారం పరిశీలించారు.

లోటుపాట్లు తలెత్తరాదు

అనంతపురం టవర్‌క్లాక్: సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి కేశవ్ ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలసి జిల్లా స్థాయి అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, అసిసెంట్ కలెక్టర్ సచిన్ రహర్‌తో చర్చించి రూట్‌మ్యాప్‌ను రూపొందించారు.

34 ప్రాంతాల్లో తగ్గిన భూగర్భజలాలు

- జిల్లా సగటు నీటిమట్టం 11.67 మీటర్లు
- ఈ ఏడాది 37.5 శాతం అదనంగా వర్షాలు
- డేంజర్ జోన్‌లో నార్పల
- వాల్టా పరిధిలోకి 13 గ్రామాలు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని 34 ప్రాంతాల్లో భూగర్భజలాలు తగ్గిపోయాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 97 ఫిజోమీటర్ల పరిశీలనలో 34 ఫిజోమీటర్లలో భూగర్భజలాలు క్షీణిస్తోన్నట్లు భూగర్భజలశాఖ తాజా నివేదికలో వెల్లడైంది. ప్రస్తుతం జిల్లా సగటు నీటిమట్టం 11.67 మీటర్లుగా నమోదైంది. ఈ ఏడాది 473.9 మి.మీకు గాను 37.5 శాతం అధికంగా 651.4 మి.మీ వర్షం కురిసింది. వర్షం రూపంలో 40.94 టీఎంటీలు భూగర్భంలో అందుబాటులో ఉండగా.. అందులో 14.45 టీఎంసీలు వినియోగిస్తున్నారు. ఇంకా 26.49 టీఎంసీలు మిగులు ఉన్నాయి. నార్పల మండలంలో భూగర్భజలాలు అధికంగా వినియోగిస్తుండటంతో డేంజర్ జోన్‌లో ఉంచారు. జిల్లా అంతటా 1,87,610 బోరుబావులు వినియోగిస్తుండగా... కొత్తగా బోరుబావుల తవ్వకాన్ని నిషేధిస్తూ 13 గ్రామాలను వాల్టా పరిధిలోకి చేర్చారు. సగటు నీటి మట్టం 11.67 మీటర్లుగా నమోదైనా... యాడికి మండలం రాయలచెరువు ఫిజోమీటర్‌లో 41.01 మీటర్ల లోతులో కనిపిస్తున్నాయి. అలాగే శెట్టూరు మండలం చెర్లోపల్లి ఫిజోమీటర్‌లో కూడా 38.92 మీటర్లు, మండల కేంద్రం పుట్లూరులో 35.28 మీటర్లు లోతుకు భూగర్భజలాలు క్షీణించాయి. బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, కళ్యాణదుర్గం, కుందుర్పి, పామిడి, నార్పల, పుట్లూరు, రాయదుర్గం, శెట్టూరు, తాడిపత్రి, యాడికి తదితర 12 మండలాల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టినట్లు తాజా నివేదిక వెల్లడిస్తోంది. అయితే గతేడాదితో పోల్చితే ఈ సారి 3.35 మీటర్లు పెరుగుదల ఉన్నట్లు ఆశాఖ డీడీ కె.తిప్పేస్వామి తెలిపారు.... కానీ 34 ప్రాంతాల్లో తగ్గుదల నమోదైందని తెలిపారు.

జేఎన్‌టీయూ గౌరవ డాక్టరేట్‌కు చావా ఎంపిక



సత్యనారాయణ చావా

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం 14వ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ కోసం డాక్టర్ సత్యనారాయణ చావాను ఎంపిక చేశారు. లారస్ ల్యాబ్స్ ఫౌండర్ అండ్ సీఈఓగా ఉన్న డాక్టర్ సత్యనారాయణ చావాకు గౌరవ డాక్టరేట్ అందించాలని చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాలు జారీ చేశారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఎం.ఆర్.మాధవ్ ఎమిరటస్ ప్రొఫెసర్, ఐఐటీ కాన్పూర్ ను ఎంపిక చేశారు. మే 17న స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నారు. గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవానికి హాజరు కానున్నారు.

చావా విజయ ప్రస్థానం..

లారస్ ల్యాబ్స్ కంపెనీ ఏర్పాటైన 18 ఏళ్లలో ఇప్పటి వరకు 150 కొత్త మందులు కనిపెట్టారు. రెస్పెక్ట్.. రివార్డు..రీటెయిన్ అనే మూడు స్తంభాలపై ల్యాబ్స్ నిర్మాణం జరిగింది. నాలుగో స్తంభం డాక్టర్ చావా సత్యనారాయణ. ర్యాన్‌బ్యాక్సీలో యువ పరిశోధకుడిగా డాక్టర్ సత్యనారాయణ విజయ ప్రస్థానం మొదలైంది. మ్యాట్రిక్స్‌లో చేరిన 8 సంవత్సరాలకే ఆ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఎదిగారు. లారస్ ల్యాబ్ స్థాపన (2005) (హైదరాబాద్)తో భారతీయ ఔషధ ఉత్పత్తుల రంగానికి పితామహులు అయ్యారు. సాక్షి 2021 సంవత్సరంలో 'బిజినెస్ పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా ఆయన్ని సత్కరించింది.

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించండి



అర్జీదారుల సమస్యలు వింటున్న జేసీ

బుక్కరాయసముద్రం: ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. బుక్కరాయసముద్రంలోని షిరిడీ సాయి కల్యాణమండలంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జేసీ శివ్ నారాయణ్ శర్మ, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ హాజరయ్యారు. జేసీ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను పరిశీలించి సకాలంలో నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుంచి 506 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓ కేశవ నాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, సివిల్ సప్లయ్ డీఎం రమేష్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, హౌసింగ్ పీడీ శైలజ, డ్వా మా పీడీ సలీం, మైన్స్ ఏడీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాలోమన్ పాల్గొన్నారు.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

అనంతపురం అర్బన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై జేసీ సోమవారం ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 12 నుంచి 20 వరకు థియరీ పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లావ్యాప్తంగా 48 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 16,423 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 5,278 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి మొదటి సంవత్సరం 1,528 మంది, ద్వితీయ సంవత్సరం 1,056 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. ఇక ప్రాక్టికల్స్ ఈ నెల 28 నుంచి జూన్1 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్ర 5 గంటల వరకు జిల్లా కేంద్రంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో మాత్రమే జరుగుతాయని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్‌డీఓ కేశవనాయుడు, డీవీఈఓ వెంకటరమణనాయక్, డీఈసీ సభ్యులు శంకరయ్య, నాగరత్నమ్మ, అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ లేబర్ కమిషనర్ లక్ష్మీనరసింహ, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కృష్ణ చైతన్య, ఆర్‌టీసీ ఆర్ఎం సుమంత్ పాల్గొన్నారు.

చిన్నారుల ఆకలి కేకలు

- ఎన్ఆర్‌సీలో సౌకర్యాలు నిల్
- వంట చేయడానికి మనుషులేరీ?
- తప్పని పరిస్థితుల్లో వంట చేస్తున్న స్టాఫ్‌నర్సులు
- చిన్నారులకు పూర్తిస్థాయిలో అందని పోషకాహారం
- పర్యవేక్షణ మరచిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



డైట్ ఆలస్యమవుతోందని చెబుతున్న బాధితులు



వంట సిద్ధం చేస్తున్న నర్సు



సర్వజనాస్పత్రిలోని ఎన్ఆర్‌సీలో చిన్నారులు

అనంతపురం మెడికల్: పోషకాహార పునరావాస కేంద్రం (న్యూట్రీషియన్ రీహ్యాబిలిటేషన్ సెంటర్–ఎన్ఆర్‌సీ)లో చిన్నారుల ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. తీవ్రమైన పోషకాహార లోపం ఉన్న పిల్లలను 14 రోజుల పాటు ఎన్ఆర్‌సీలో ఉంచి వారు బరువు పెరిగాక డిశ్చార్జ్ చేస్తుంటారు. తల్లులకు పోషకాహారం, వైద్యం, సంరక్షణ గురించి ఇక్కడ అవగాహన కల్పిస్తుంటారు. అయితే వైద్య ఆరోగ్యశాఖాధికారుల బాధ్యతారాహిత్యంతో ఎన్ఆర్‌సీ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి.

ఎన్ఆర్‌సీలో సేవలు..

పౌష్టికాహార లోపంతో బక్కచిక్కిన చిన్నారులకు ఎన్ఆర్‌సీలో వైద్యులు, డైటీషియన్, స్టాఫ్‌నర్సుల పర్యవేక్షణలో రెండు వారాల పాటు వైద్య చికిత్సలందిస్తారు. రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతి రెండు గంటలకు ఒకసారి చిన్నారులకు డైట్ (ఆహారం) ఇస్తారు. ఉదయం 6 గంటలకు పాలు/రాగిమాల్ట్, 8 గంటలకు పాయసం/ సగ్గుబియ్యం, వేరుశనగ పచ్చడితో చపాతి, జొన్నరొట్టె, రాగిరొట్టె, 10 గంటలకు ఉడికించిన కోడిగుడ్డు/ పండు/ మొలకెత్తిన తింజలు, 12 గంటలకు రాగిముద్ద లేదా అన్నం పప్పుతో కూర, మధ్యాహ్నం 2 గంటలకు ఉడికించిన కూరగాయలు, 6 గంటలకు ఏదైనా పండు, 8 గంటలకు మధ్యాహ్నం భోజనం లాగే ఇవ్వాలి. రాత్రి పడుకునే ముందు గ్లాసు పాలు ఇవ్వాలి.

ఆహార పంపిణీలో తీవ్ర జాప్యం

పోషకాహార పునరావాస కేంద్రం (ఎన్ఆర్‌సీ)లో చిన్నారులకు డైట్ అందించేందుకు ఇద్దరు వంట మనుషులు అవసరం. అయితే ఇక్కడ ఒక పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. ఉన్న ఒక్క వంట మనిషి ప్రసూతి సెలవులో వెళ్లారు. ఇక వంట చేయడానికంటూ ప్రత్యేకంగా మనుషులు లేరు. దీంతో ప్రతి రెండు గంటలకు ఒకసారి అందాల్సిన డైట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. సకాలంలో ఆహారం అందక చిన్నారులు ఎదురు చూడడం.. కొందరు ఆకలికి నకనకలాడటం నిత్య కృత్యమైపోయింది.

అమ్మలా చూసుకుంటున్న స్టాఫ్‌నర్సులు

ఎన్ఆర్‌సీలోని వైద్యులు ఉదయం, మధ్యాహ్నం వరకు ఉండి తర్వాత పత్తా లేకుండా పోతున్నారు. ఇక స్టాఫ్‌నర్సులు తమ విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు చిన్నారుల ఆకలిదప్పులు తీర్చేందుకు వంట వండి పెడుతున్నారు. స్టాఫ్‌నర్సులు అందుబాటులో లేని సమయంలో అటెండర్ వంట వండాల్సి వస్తోంది. ఇదే విషయమై ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేస్తే..'మీరు డీఎంహెచ్‌ఓ పరిధిలో ఉంటారు. ఉన్న వారితోనే సర్దుబాటు చేసుకోండి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. ఇక డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అయితే తమ కార్యాలయం ఎదురుగా ఉన్న సర్వజనాస్పత్రి ఎన్ఆర్‌సీని ఏనాడూ పర్యవేక్షించిన దాఖలాలు లేవు. కేంద్రం ఎలా నడుస్తోందో.. సిబ్బందికి సలహాలు, సూచనలు కూడా ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సౌకర్యాలు పట్టించుకునే వారేరీ?

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉన్నారని, తమకేం సంబంధం లేదని చెప్పే సర్వజనాస్పత్రి అధికారులు ఎన్ఆర్‌సీలో ఉన్న డైటీషియన్‌ను మదర్ మిల్క్ బ్యాంకుకు డిప్యుటేషన్‌పై పంపారు. ప్రస్తుతం ఉన్న మరో డైటీషియన్ సెలవులో ఉన్నారు. అదేవిధంగా ఎన్ఆర్‌సీలో రెండు ఏసీలు పని చేయడం లేదు. ఫ్యాన్లు తిరగని పరిస్థితి. వంట వండే ఫ్లోర్‌లో పైకప్పు పెచ్చులూడి పడుతోంది. ఒక్కోసారి పైన ఉన్న బాత్‌రూంల నుంచి మురుగు కిందకు లీకవుతోందని సిబ్బంది చెబుతున్నారు. ఇన్ని అసౌకర్యాలున్నా.. అధికారులు అటువైపు తొంగి చూడడం లేదు.

పోక్సో కేసు నమోదు

పుట్లూరు: బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన 51 ఏళ్ల వయసున్న వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. పుట్లూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటి వద్ద వాష్‌రూంకు వెళ్లి వస్తున్న తరుణంలో అదే గ్రామానికి చెందిన వెంకట్రాముడు అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తప్పించుకుని తల్లిదండ్రులకు తెలిపింది. బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వెంకట్రాముడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌పీల డిమాండ్లను నెరవేర్చాలి



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం మెడికల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ఆరోపించారు. సర్వజనాస్పత్రి ఎదుట నిరవధిక సమ్మె చేపట్టిన ఎంఎల్‌హెచ్‌పీలకు సోమవారం ఆయన సంఘీభావం తెలిపి, మాట్లాడారు. ఎంఎల్‌హెచ్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరేళ్లు దాటిన వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతనాన్ని అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మిడ్‌లెవెల్ ప్రొవైడర్ అసోసియేషన్ నాయకులు గౌరి, అనూష, దివ్య, రాజేశ్వరి, వినోద్, శివరాం పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల పోస్టర్ల విడుదల



మంత్రి కేశవ్‌ను సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్న పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన పోస్టర్లను కొకుంట్లలోని తన స్వగృహంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం విడుదల చేశారు. ఆలయ ఈఓ సాకే రమేష్ బాబు, ప్రధాన అర్చకులు ద్వారకానాథాచార్యులు, బాలాజీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

8న జిల్లా జైలులో వేలం

బుక్కరాయసముద్రం: మండలంలోని జిల్లా జైలులో ఈ నెల 8న 25 వేల కిలోల వేరుశనగ చెక్కకు వేలం పాట నిర్వహించనున్నారు. ఈ మేరకు జైలు సూపరింటెండెంట్ రహమాన్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేలం ప్రక్రియలో పాల్గొనే వారు రూ.20 వేల ధరావత్తు చెల్లించాలి. వేలం ముగిసిన తర్వాత ధరావత్తు వెనక్కు చెల్లిస్తారు.

వాడిపోతున్న జలపుష్పాలు

- భానుడి భగభగలకు వేడెక్కుతున్న నీరు
- వేడిని తట్టుకోలేక మృత్యుఒడికి చేరుతున్న చేపలు

రాయదుర్గం: ప్రచండ భానుడి భగభగలకు జిల్లా నిప్పుటి కుంపటిని తలపిస్తోంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండల ధాటికి మనుషులే కాదు జీవరాసులూ విలవిల్లాడుతున్నాయి. ఈ తాపం భూమిపై ఉన్న జీవరాసులకే కాదు.. నీటిలో ఉన్న జలచరాలను సైతం తాకింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక ఉష్ణోగ్రత కారణంగా రిజర్వాయర్లు, చెరువులు, నీటికుంటల్లోని చేపలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. దీంతో వేసవి తాపం తాళలేమంటూ లోతైన నీటిలోకెళ్లి దాక్కుంటున్నాయి.

రూ.12 కోట్ల ఆదాయానికి గండి

అనంతపురం– ఎంపీఆర్ మత్స్య క్షేత్రాల వద్ద 100 ఎంఎం పరిమాణంతో ఉత్పత్తి చేసిన 19.5 లక్షల చేప పిల్లలను ప్రభుత్వ ధర ప్రకారం మత్స్యకార సంఘాలకు సరఫరా చేశారు. అలాగే మధ్యతరహా ప్రాజెక్టులైన భైరవానితిప్ప ప్రాజెక్టులో ఈ ఏడాది 6.48 లక్షలు, పీఏబీఆర్‌లో 12 లక్షలు చేప పిల్లలను వంద శాతం రాయితీతో విడుదల చేశారు. దీనికి తోడు ప్రధాన మంత్రి మత్స్య సహకార పథకం కింద జిల్లాలోని బుక్కరాయసముద్రం, పుట్లూరు, శింగనమల,



చాగల్లు, గుత్తి పెద్ద చెరువు, జంబులదిన్నె, మాముడూరు, కలుగోడు, రంగసముద్రం, గుమ్మఘట్ట కమతం చెరువు, పెద్ద ట్యాంకు, గూళ్యం, బెట్టిట్యాంకు భూపసముద్రం, శ్రీధర ఘట్ట, తదితర 15 చెరువుల్లో మత్స్యకార సంఘాల ఆధ్వర్యంలో 40 శాతం రాయితీతో 14.86 లక్షల చేపపిల్లల పెంపకం చేపట్టారు. ఈ చెరువుల ద్వారా చేపల ఉత్పత్తి జరిగితే 356 టన్నులకు గాను రూ.3.56 కోట్లు, జలాశయాల ద్వారా 918 టన్నులకు గాను రూ.9.18 కోట్లు ఆదాయం రావచ్చని మత్స్యశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే ఈ దిగుబడిపై ఎండలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎక్కడికక్కడ ఆవిరి రూపంలో బయటకు వెళ్లడంతో నీరు అడుగంటి కొద్ది చేపలు మృత్యువాత పడుతున్నాయి. మధ్యాహ్నం నేరుగా తాకే సూర్యకిరణాల తీవ్రతను తాళలేక చేపలన్నీ ఒకేచోటకు పోగవుతున్నాయి.

జాగ్రత్తలు అవసరం



ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువైంది. మే నెల ఆరంభం నాటికే 44 డిగ్రీలు దాటిపోయింది. దీని ప్రభావం జలాశయాలు, చెరువులు, కుంటల్లోని చేపలపై తీవ్రంగా చూపుతోంది. నీరు అడుగంటిపోయే చెరువుల్లో చేపలు మృతి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అంతేకాక మధ్యాహ్నం ఎండ తీవ్రతకు చేపలన్నీ ఒకే చోట పోగవుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఒత్తిడికి లోనై చేపలు మరణిస్తాయి. ఈ నెలాఖరు వరకు మత్స్యకారులు తగిన జాగ్రత్తలు పాటించాలి. సరైన సలహా, సూచనలు తీసుకోవాలి.

– లక్ష్మీనారాయణ, ఎఫ్‌డీఓ, బీటీపీ

ఆర్డీటీ పరిరక్షణకు ప్రజా ఉద్యమం

రిలే దీక్షలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు 'అనంత'



రిలే దీక్షలో మాట్లాడుతున్న అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపుర అర్బన్: ఆర్డీటీకి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) రెన్యూవల్ మరింత ఆలస్యం జరిగితే ప్రజా ఉద్యమాన్ని చవి చూడాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి హెచ్చరించారు. ఓ పార్టీకి ప్రతినిధిగా ఈ మాట తాను చెప్పడం లేదని, జిల్లా పౌరుడిగా ఆర్డీటీ అందిస్తున్న సేవలను దగ్గరగా చూసి చెబుతున్నానని అన్నారు. ఆర్డీటీని కాపాడాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబుపై ఉందన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అధ్యక్షతన రిలే దీక్షలు మొదలయ్యాయి. కార్యక్రమానికి అనంత వెంకట్రామిరెడ్డి సంఘీభావం ప్రకటించి, మాట్లాడారు. ఆర్డీటీ కేవలం స్వచ్ఛంద సంస్థ మాత్రమే కాదని, ఇక్కడి ప్రజల జీవితాల్లో ఓ భాగం.. వారి భావోద్వేగాలకు ప్రతిరూపమని అన్నారు. ఐదున్నర దశాబ్దాలుగా ఎంత మంది జీవితాల్లో వెలుగులు నింపిన ఆర్డీటీకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయకపోవడంతో సేవలకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఇదే అంశంపై ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాను విజ్ఞప్తి లేఖలు రాశానని గుర్తు చేశారు. ఇక్కడి ప్రజాప్రతినిధులు కూడా ఆర్డీటీ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళితే 'మీరే కేంద్రం వద్దకెళ్లి మాట్లాడండి' అంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఆర్డీటీని కాపాడాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. ఆర్డీటీ సేవలు ఆగితే ప్రజలే తీవ్రంగా నష్టపోతారనే విషయాన్ని అందరూ గమనించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గేయానంద్, మచ్చారామలింగారెడ్డి, రవిచంద్ర, వివిధ కుల, ప్రజాసంఘాల నాయకులు చామలూరు రాజగోపాల్, కోట్ల గంగాధర్, కేవీరాజు, రామన్న, సుగమంచి శ్రీనివాసులు, బాలపెద్దన్న, టీపీ రామన్న, ఐఎంఎం బాషా, జన్నే ఆనంద్, టీవీరెడ్డి, హరినాథరెడ్డి, వంశీకృష్ణ, రాచేపల్లి రామాంజినేయులు, కృష్ణారెడ్డి, సాకే గోవర్దన్, రామకృష్ణ, రాకెట్ల సూర్యనారాయణ, వరికూటి కాటమయ్య, వెంకటాపురం మారుతి, తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాప్‌లో చోరీ

గుత్తి రూరల్: స్థానిక గుంతకల్లు రోడ్డులోని ఎస్‌వీఎస్ వైన్ షాపులో చోరీ జరిగింది. వైన్ షాపు సిబ్బంది తెలిపిన మేరకు.. ఆదివారం లావాదేవీలు ముగించుకున్న అనంతరం మద్యం దుకాణానికి తాళం వేసి సిబ్బంది వెళ్లిపోయారు. సోమవారం వేకువజామున దుకాణానికి ఉన్న షట్టర్‌ను తొలగించి లోపలకు చొరబడిన దుండగులు రూ.50 వేలు విలువ చేసే బ్రాందీ, విస్కీ, బీరు బాటిళ్లను ఎత్తుకెళ్లారు. ఉదయం అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో యజమానితో పాటు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పట్టపగలే ఇంట్లోకి చొరబడిన దొంగ

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లిలో సోమవారం మధ్యాహ్నం ఓ దుండగుడు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా గుర్తించిన యజమాని తెలివిగా బంధించాడు. వివరాలు... గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి రమేష్ భార్య హరిత తన పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి రమేష్ ఉద్యోగానికి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంటి తలుపులు తీసి లోపల ఉన్న దుండగుడు.. రమేష్ రాకను గమనించి పక్కనే ఉన్న పశువుల పాకలోకి దూరాడు. గమనించిన రమేష్ పశువుల పాకకు బయట నుంచి గడిపెట్టి ఇంట్లోకి వెళ్లి పరిశీలిస్తే బీరువాలోని ఐదు తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సురేష్ అక్కడకు చేరుకుని అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. అయితే తాను చోరీకి పాల్పడలేదని, గుజరీ వస్తువులు సేకరించుకుని జీవనం సాగిస్తున్న తనది కర్నూలు అని తెలిపాడు. కాగా, ఉదయం నుంచి గ్రామంలో అతడితో పాటు మరో మహిళ కూడా ఉండేదని చోరీ చేసిన బంగారు నగలు ఆమెకు ఇచ్చి పంపి ఉంటాడని అనుమానాలను స్థానికులు వ్యక్తం చేయడంతో దుండగుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి, విచారణ చేపట్టారు.

నగరంలో కిడ్నాప్ యత్నం

అనంతపురం: నగరంలో సోమవారం రాత్రి కిడ్నాప్ కలకలం చెలరేగింది. ఆరో రోడ్డుకు చెందిన మురళి, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. వీరిద్దరూ తాడిపత్రికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ విషయంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. దీంతో ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి మరో ముగ్గురిని కారులో పిలుచుకు వచ్చి ఆరో రోడ్డులో ఉన్న మురళిని బలవంతంగా కారులో ఎక్కించుకుని పోయాడు. టవర్ క్లాక్ వద్దకు చేరుకోగానే మురళి గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న టూటౌన్ సీఐ శ్రీకాంత్ కారును అడ్డుకున్నారు. మురళిని కాపాడి, కారుతో సహా నిందితులను నాల్గో పట్టణ పోలీసులకు అప్పగించారు. వీరిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

ప్రమాదంలో వ్యక్తి మృతి

గుత్తి రూరల్: ఆటో ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల తిమ్మాపురం గ్రామానికి చెందిన రమేష్ (45) సోమవారం ఉదయం అనారోగ్యంతో బాధపడుతున్న తన వదిన భీమక్కను చికిత్స కోసమని గుంతకల్లులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి పిలుచుకెళ్లాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు గుత్తి శివారులోని నేమతాబాదు జగనన్న కాలనీ వద్దకు చేరుకోగానే చెరువుకట్ట వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన ఆటో ఢీకొంది. ఘటనలో రమేష్, భీమక్క తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు గుర్తించి క్షతగాత్రులను గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక రమేష్ మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బీసీల పేరుతో బహిరంగ దోపిడీ

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కురుబ దేవేంద్ర



మాట్లాడుతున్న కురుబ దేవేంద్ర

అనంతపురం కార్పొరేషన్: బీసీల పేరుతో కూటమి ప్రభుత్వం బహిరంగ దోపిడీకి పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కురుబ దేవేంద్ర, నగర అధ్యక్షుడు లక్ష్మణ్ణ విమర్శించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది మహిళలకు 50 రోజుల పాటు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. శిక్షణకు హాజరయ్యే ప్రతి మహిళకూ రూ. 3 వేల స్టయిఫండ్‌తో పాటు శిక్షణ అనంతరం కుట్టుమిషన్‌ను ఉచితంగా అందజేసేలా కార్యాచరణను రూపొందించారన్నారు. ఇందు కోసం ఒక్కో లబ్ధిదారుకు రూ.23 వేలు వెచ్చిస్తున్నట్లుగా ప్రకటించిందన్నారు. ఇక్కడి వరకూ అంతా బాగానే ఉన్నా... శిక్షణ కాలంలో చెల్లించే రూ.3 వేల స్టయిఫండ్, ఉచితంగా అందజేసే కుట్టు మిషన్ ధర రూ.4,300 పోను... రూ.23 వేలలో మిగిలిన రూ.15,700 ఏమవుతున్నదో అంతు చిక్కడం లేదన్నారు. శిక్షణ సమయంలో దారం, టేపు, కత్తెర, స్కేల్ వంటి పరికరాలను లబ్ధిదారులే సమకూర్చుకుంటున్నారన్నారు. మొత్తం ఈ వ్యవహారంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది మహిళలకు అయ్యే ఖర్చు రూ.73 కోట్లు కాగా, మిగిలిన రూ.167 కోట్లను దిగమింగేందుకే ఈ పథకాన్ని ప్రభుత్వ పెద్దలు అమలు చేస్తున్నట్లుగా అర్థమవుతోందన్నారు. జాతీయ స్థాయిలో అనుభవం కలిగిన సంస్థలను పక్కన పెట్టి, సొంత సంస్థలకు శిక్షణ కాంట్రాక్ట్‌లను కట్టబెట్టి కూటమి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. పథకాల పేరుతో ప్రజాధనాన్ని దోచుకొనేందుకు సిద్ధమైన ప్రభుత్వ పెద్దల తీరును ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సెల్ నాయకులు గోగుల పుల్లయ్య, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహసనంలా 'పోలీసు గ్రీవెన్స్'

- ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయని వైనం
- బాధితులపైనే రివర్స్ కేసులతో సతాయింపు
- పోలీసు వ్యవస్థపై సన్నగిల్లుతున్న నమ్మకం

- బొకుగుప్పలోని విజయలక్ష్మి మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్న ఈరక్క... అదే సంఘంలో సభ్యురాలిగా ఉన్న మారుతమ్మ తీసుకున్న అప్పు రూ.40 వేలు చెల్లించకపోవడంతో ప్రశ్నించింది. దీంతో ఆమెపై మారుతమ్మ దాడి చేసింది. గతేడాది డిసెంబర్ 13న జరిగిన ఈ ఘటనపై అప్పట్లోనే బాధితురాలు ఫిర్యాదు చేసినా పోలీసులు ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదు. పైగా ప్రలోభాలకు తలొగ్గి ఈరక్కపైనే కేసు నమోదు చేశారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ బాధితురాలు అదే ఏడాది డిసెంబర్ 23న పోలీసు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం దక్కక పోవడంతో సోమవారం మరోసారి పోలీసు గ్రీవెన్స్‌కు హాజరై తన గోడు వెళ్లబోసుకుంది.
- అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి గత శనివారం పల్లవి అనే మహిళ బస్సులో ప్రయాణిస్తూ తన సంచిలో ఉంచిన స్టీల్ బాక్స్‌ను పోగొట్టుకుంది. అందులో రూ.15.50 లక్షలు విలువ చేసే బంగారు నగలు ఉన్నాయని కళ్యాణదుర్గంతో పాటు అనంతపురం పోలీస్‌స్టేషన్లలో ఆమె ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు హాజరై ఫిర్యాదు చేసింది.

.. ఇలా జిల్లా వ్యాప్తంగా బాధితులు ఎందరో ఉన్నారు. తమకు న్యాయం జరుగుతుందని పోలీసులను ఆశ్రయించిన వారికి భంగ పాటు తప్పడం లేదు. చివరకు తమకు జరిగిన అన్యాయాన్ని జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు వివరించి అందజేసిన అర్జీలకూ దిక్కుమొక్కు లేకుండా పోతోంది. దీంతో 'పోలీసు గ్రీవెన్స్' ఓ ప్రహసనంలా మారి వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి

అనంతపురం: తమకు ఏదైనా అన్యాయం జరిగితే ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులే. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ పరిస్థితిలో గణనీయమైన మార్పులు వచ్చాయి. అన్యాయం జరిగిన వెంటనే బాధితులు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేస్తే కేసు నమోదుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. తమ సమస్యకు పరిష్కారం దక్కక అయోమయంలో ఉన్న బాధితులు నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తే... వాటిలో 50శాతం పిటిషన్లను గ్రీవెన్స్ పరిధిలోకి రావని తిరస్కరిస్తున్నట్లు సమాచారం. ఈ గందరగోళం మధ్యనే టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి బాధితులపైనే పోలీసులు రివర్స్ కేసులు బనాయిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది.

వెల్లువలా వినతులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో బాధితులు ఎంతో వ్యయప్రయాసలకోర్చి జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని ఉన్నతాధికారుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఈ వినతుల్లో సైతం పరిష్కారం దక్కేది ప్రశ్నార్థకమై 'నేతి బీరలో నెయ్యి...' అనే చందంలా మారింది.

74 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 74 వినతులు అందాయి. అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఎస్. మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఈ-పాస్ మిషన్ అపహరణ

- టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ నిర్వాకంతో కార్డుదారులకు అందని రేషన్
- ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని పోలీసులు



స్టోరు వద్ద సరుకుల కోసం వచ్చిన కార్డుదారులు

రాయదుర్గం టౌన్: స్థానిక కోతిగుట్టలోని 17వ నంబర్ స్టోరు డీలర్ రామకృష్ణను బెదిరించి ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ అశోక్ దౌర్జన్యంగా ఈ-పాస్ మిషన్ ఎత్తుకెళ్లాడు. బాధితుడు తెలిపిన మేరకు... డీలర్‌షిప్ దక్కించుకునేందుకు అశోక్ దౌర్జన్యాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలోనే అధికారులపై ఒత్తిళ్లు తీసుకెళ్లడంతో పలుమార్లు తనిఖీలు చేసి 6ఏ కేసు నమోదు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. కానీ ఎలాంటి అవకతవకలు జరగలేదని నిర్ధారణ కావడంతో అధికారులు సైతం అడుగు ముందుకు వేయలేకపోయారు. దీంతో ఈ నెల 3న స్టోర్ వద్ద నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సమయంలో అశోక్ అక్కడకు చేరుకుని దౌర్జన్యంగా ఈ-పాస్ మిషన్ ఎత్తుకెళ్లాడు. దీంతో కార్డుదారులకు రేషన్ పంపిణీ నిలిచిపోయింది. స్టోరు పరిధిలో మొత్తం 936 కార్డులు ఉండగా 625 కార్డులకు రేషన్ పంపిణీ జరిగింది. ఇంకా 300లకు పైగా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. శనివారం నుంచి లబ్ధిదారులు స్టోరు వద్ద వచ్చి తిరిగి మిషన్ లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఘటనకు సంబంధించి పోలీసులు, తహసీల్దార్, సీఎస్‌డీటీకి ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ ఎలాంటి పరిష్కారం దక్కలేదు. ఈ-పాస్ యంత్రం అపహరణపై సీఐకు ఫిర్యాదు చేస్తే కనీసం కేసు కూడా నమోదు చేయలేదని బాధితుడు వాపోయాడు. ఈ అంశంపై నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు రామకృష్ణ తెలిపారు.

జనావాసంలో మయూరం



పెద్దవడుగూరు: మండలంలోని గుత్తి అనంతపురం గ్రామంలో ఓ నెమలి సోమవారం కోళ్ల మధ్యన తిరుగుతూ స్థానికులకు కనువిందు చేసింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఇళ్ల మధ్యన తిరుగుతూ ఎవరైనా దాణా వేస్తే తింటూ అక్కడే చెట్ల మీద వాలుతూ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారయత్నం

పెద్దపప్పూరు: మండలంలోని ఓ గ్రామంలో మతిస్థిమితం లేని మహిళపై సోమవారం స్థానికుడు అత్యాచారయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా పెట్నికోట గ్రామానికి చెందిన మతి స్థిమితం లేని ఓ మహిళ తన తల్లితో కలిసి శుక్రవారం పెద్దపప్పూరు మండలంలోని ఓ గ్రామంలో నివాసముంటున్న వారి బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం ఒంటరిగా ఉన్న ఆమెపై అదే గ్రామానికి చెందిన వీరాంజనేయులు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ ఆ గ్రామానికి చేరుకుని బాధిత మహిళ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అనంతలో నకిలీ అక్రిడిటేషన్ల కలకలం



నకిలీ అక్రిడిటేషన్

అనంతపురం: జిల్లాలో నకిలీ అక్రిడిటేషన్లు బయట పడ్డాయి. ఏకంగా కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన నకిలీ అక్రిడిటేషన్లను ఒక్కొక్కటి రూ.30 వేల నుంచి రూ.50 వేలకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లుగా అధికారులు గుర్తించారు. 'ప్రజాబలం–ప్రశ్నించే గళం' పేరుతో మీడియా అక్రిడిటేషన్ కార్డు–2024ను డీపీఆర్వో గురుస్వామి శెట్టి గుర్తించి నిగ్గు తేల్చాలంటూ అనంతపురం వన్‌టౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో అధికారికంగా చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేంద్రనాథయాదవ్ స్పష్టం చేశారు. కాగా, అసలైన అక్రిడిటేషన్ల గడువు ఈ నెల 31తో ముగియనుంది. అయితే నకిలీ అక్రిడిటేషన్లు ఏకంగా 2026, జనవరి 1 చలామణిలో అయ్యేలా ముద్రించడం గమనార్హం. నేర చరిత ఉన్న వారు సైతం మీడియా ముసుగులో రిపోర్టర్లుగా చలామణి అయ్యేందుకు ఇలా నకిలీ అక్రిడిటేషన్లు సృష్టించి దందా సాగిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు.

క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి పిలుపు

అనంతపురం టవర్‌క్లాక్‌: కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి శ్రేణులు ముందుకురావాలని జిల్లా అధ్యక్షుడు మదుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని కాంగ్రెస్‌ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు పీసీసీ చీఫ్‌ షర్మిలారెడ్డి ఈ నెల 9 నుంచి పర్యటన చేయనున్నారన్నారు. వచ్చే నెల 11న జిల్లాలో పర్యటన ఉంటుందని, కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోత్తపల్లి వీరన్న, శెట్టురు మల్లయ్య, ఇమామ్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం సరికాదు

అనంతపురం క్రైం: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని నేషనల్‌ మజ్దూర్‌ యూనియన్‌ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం అనంతపురం తహసీల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్‌ జిల్లా చైర్మన్‌ సూరిబాబు మాట్లాడుతూ ఐదు విడతలుగా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నా అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదని మండిపడ్డారు. ఫలితంగా చాలా మంది ఆర్టీసీ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగాలకు 472 మంది ఎంపిక



ఉద్యోగ మేళాకు హాజరైన నిరుద్యోగ అభ్యర్థులు

అనంతపురం ఎడ్యుకేషన్‌: స్థానిక ఆర్ట్స్‌ కళాశాల, ఏపీ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 472 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. దాదాపు 15 కంపెనీల నుంచి హెచ్‌ఆర్‌ ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 800 మంది నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొనగా.. వారిలో 472 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ సమన్వయకర్త జీవన్‌కుమార్‌, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మంగారి ఆరాధన

అనంతపురం కల్చరల్‌: కాలజ్ఞానంతో భూతభవిష్యత్‌ కాలాన్ని నిర్దేశించిన సంఘ సంస్కర్త వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం మంగళ, బుధవారం రెండురోజుల పాటు ఘనంగా జరగనుంది. పాతూరు రాణీనగర్‌లోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం గణపతి పూజ, జగద్గురు గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రులకు పంచామృతాభిషేకం, సాయంత్రం స్వామి వారి సంకీర్తన, భజనలు, నక్షత్ర హారతులు ఉంటాయి. బుధవారం ఉదయం ఆరు గంటల నుంచే ఆరాధనలో భాగంగా వీరబ్రహ్మేంద్రులకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం నగరోత్సవం జరుగుతాయని ఆలయ ధర్మకర్త గురుప్రసాద్‌, వైఎస్‌ ప్రకాష్‌ ఆచారి తెలిపారు.

గుత్తి డీవైఈఓకు సన్మానం



మల్లారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌టీఏ, పీఆర్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్‌: గుత్తి డివిజన్‌ ఉప విద్యాశాఖ అధికారి (డీవైఈఓ)గా నియమితులైన బెళుగుప్ప ఎంఈఓ పాటిల్‌ మల్లారెడ్డిని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం సన్మానించారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీ వైఎస్సార్‌టీఏ, పీఆర్టీయూ సంయుక్త ఆధ్వర్యంలో సన్మానించారు. విధుల పట్ల నిక్కచ్చిగా వ్యవహరించే మల్లారెడ్డికి తమవంతుగా సహకరిస్తామన్నారు. హెచ్‌ఎంగా, ఎంఈఓగా సక్సెస్‌ అయిన మల్లారెడ్డికి ప్రభుత్వం మరో కీలక బాధ్యత అప్పగించిందన్నారు. అక్కడ కూడా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, వెంకటరమణ, గోపాల్‌, రవీంద్రరెడ్డి, ఓబిరెడ్డి, రామకృష్ణ, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆత్మకూరు: మండల కేంద్రం ఆత్మకూరులోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌ ఎగ్గిడి వరలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా గుండె, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. జీఆర్‌బీఎస్‌, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.



ఓబుళాంపల్లి గ్రామ సమీపంలో కంకర తేలిన రోడ్డు



ఒంటికొండ సమీపంలో రోడ్డుపై గుంతలు

అడుగుకో గుంత

- తీవ్ర ఇబ్బందుల్లో గ్రామీణులు

చెన్నేకొత్తపల్లి: రహదారులు గుంతలమయంగా మారడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని ఒంటికొండ నుంచి ఆమిదాలకుంట వరకూ దాదాపు 5 కి.మీ పొడవునా రహదారి గుంతలమయంగా మారింది. చెన్నేకొత్తపల్లి నుంచి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి వెళ్లేందుకు అనేక మంది ఈ రహదారి గుండానే వెళుతూ ఉంటారు. చెన్నేకొత్తపల్లి నుంచి ఒంటికొండ వరకూ దారి బాగానే ఉంది. అక్కడ నుంచి ఆమిదాలకుంట వరకూ అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల సమయంలో ఒంటికొండ వరకూ రహదారిని నిర్మించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా ఒంటికొండ నుంచి ఆమిదాలకుంట రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో వాహనదారులకు పగటి పూటనే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ రహదారిని వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నరసింగరాయనిపల్లి సమీపంలో అధ్వానంగా ఉన్న రహదారి

సమాజ మార్పునకు పరితపించారు

- సీకే నాగేంద్రబాబు సంతాప సభలో వక్తలు



నాగేంద్రబాబు కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల మెగా చెక్కును అందజేస్తున్న నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్‌: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ (యూటీఎఫ్‌) నేత దివంగత సీకే నాగేంద్రబాబు సమాజ మార్పు కోసం పరితపించారని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన నాగేంద్రబాబు సంతాప సభను సోమవారం యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయ భవనంలో నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులు మాట్లాడుతూ సీకే నాగేంద్రబాబు తక్కువ మాట్లాడుతూ ఎక్కువ పని చేసేవారన్నారు. సామాజిక స్పృహ ఎక్కువగా ఉండేదన్నారు. యూటీఎఫ్‌ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేఎస్‌ఎస్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ సంఘాన్ని జిల్లాలో బలోపేతం చేసేందుకు చాలా కష్టపడ్డారన్నారు. తన జీవితాన్ని, ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా సంఘం అభివృద్ధికి, ఉపాధ్యాయుల శ్రేయస్సుకు, విద్యార్థుల అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. అలాంటి నేత మృతి సంఘానికి, ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్‌ మాట్లాడుతూ నాగేంద్రబాబు సాక్షరతా ఉద్యమంలో గొప్పగా పని చేశారన్నారు. కేవీపీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప మాట్లాడుతూ నేటి సంఘం నాయకులు, ఉపాధ్యాయులు నాగేంద్రబాబు ఆశయాలను కొనసాగించాలని కోరారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథకం నుంచి నాగేంద్రబాబు కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్‌ నాయకులు లక్ష్మీరాజా, గోవిందరాజులు, లింగమయ్య, సుధాకర్‌, రమణయ్య, సరళ, రాఘవేంద్ర, దేవేంద్రమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

అనంతపురం అర్బన్‌: కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వడంతోపాటు రాష్ట్రంలో కనీస వేతనం నిర్ణయించే బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. కనీస వేతనం అమలు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం నగరంలోని సంగమేష్‌ సర్కిల్‌ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతోపాటు విద్య, వైద్యం, తదితర వాటి ఖర్చులు సామాన్య, పేద, మధ్యతరగతి వారికి భారంగా మారాయన్నారు. ఒక కుటుంబం పోషణ సాగించాలంటే కనీసం రూ.35 వేలు ఉండాలన్నారు. మునిసిపల్‌ శాఖలో కార్మికులకు పారిశుద్ధ్య కార్మికులకు రూ.21 వేలు, ఇంజనీరింగ్‌ కార్మికులకు రూ.15 వేలు ఇస్తున్నారని, ఇక వైద్యారోగ్య శాఖలో ఈ వేతనం రూ.16 వేలు, రూ.10 వేలుగా ఉందన్నారు. పార్ట్‌టైమ్‌ కంటింజెంట్‌ కార్మికులకు రూ. 4 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇతర శాఖల్లోనూ వేతన వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. అన్ని శాఖల్లోని కార్మికులకు కనీస వేతన ఒకేలా ఉండాలన్నారు. అదే విధంగా కార్మికులు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్‌, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, మెడికల్‌ కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్‌, నాయకులు దుర్గాప్రసాద్‌, కృష్ణానాయక్‌, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని అతలాకుతలం చేస్తున్న ప్రభుత్వం'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్‌ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్‌: కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని అతలాకుతలం చేస్తోందని ఏపీటీఎఫ్‌ నాయకులు మండిపడ్డారు. విద్యా వ్యవస్థలో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్‌ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడుతూ 117 జీఓ రద్దే అజెండాగా తీసుకుని గెలుపొందిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు విద్యారంగాన్ని మరింత నాశనం చేస్తోందన్నారు. 12వ పీఆర్సీ 2023 జూలై నుంచి అమలు చేయాల్సి ఉన్నా ఇప్పటికీ పట్టించుకోలేదన్నారు. సమాంతర బోధనా మాధ్యమాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్‌ చేశారు. 9న కలెక్టరేట్‌ ఎదుట జరిగే ధర్నాను, 14న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్‌ నాయకులు సతీష్‌కుమార్‌, సర్దార్‌వలి, వెంకటరమణ, గురురాజ్‌, ఓబులేసు, సూర్యనారాయణ, ఎల్లప్ప, ఆంజనేయులు, పట్నం శ్రీనివాసులు, సాయప్ప పాల్గొన్నారు.

11న ఓబులేసుస్వామి విగ్రహ ప్రతిష్ట

రామగిరి: మండలంలోని పేరూరులో ఈనెల 10, 11 తేదీల్లో గుంటు ఓబులేసుస్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు సుబ్రమణ్యం, శివకుమార్‌, రమేష్‌బాబు, మురళి, గోవర్ధన్‌, నరేంద్ర, అశోక్‌కుమార్‌, మారుతీ తెలిపారు. 10న ధ్వజస్తంభ ప్రతిష్ట, 11న స్వామివారి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేరోజు అన్నదానంతో పాటు స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు.

రెమిడియల్‌ తరగతులకు 'దూరంగా' విద్యార్థులు



జల్లిపల్లి హైస్కూల్లో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కూడేరు: రెమిడియల్‌ తరగతులకు విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు. సోమవారం జల్లిపల్లి, కూడేరు హైస్కూళ్లలో నిర్వహించిన రెమిడియల్‌ తరగతులకు 167 మంది విద్యార్థులకు గాను ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. పదో తరగతి పబ్లిక్‌ పరీక్షల్లో 280 మందికి 95 మందే ఉత్తీర్ణత సాధించారు.185 ఫెయిల్‌ అయ్యారు. ఈ నెల 19 నుంచి సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. అందుకుగాను ఫెయిల్‌ అయిన విద్యార్థుల్లో విద్యానైపుణ్యం పెంచేందుకు ఈ నెల 1 నుంచి ప్రభుత్వం రెమిడియల్‌ తరగతులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఫెయిల్‌ అయిన విద్యార్థులకు ఆదే హైస్కూళ్లలోనే రెమిడియల్‌ తరగతులు నిర్వహించేవారు. ఈసారీ ప్రభుత్వం జల్లిపల్లి హైస్కూల్లో (25 మంది విద్యార్థులు), మరుట్ల హైస్కూల్‌లో 28 మంది, కొర్రకోడు హైస్కూల్‌లో 8 మంది విద్యార్థులకు, కూడేరు హైస్కూల్లో 74 మంది, కరుట్లపల్లి హై స్కూల్‌లో 22 మంది విద్యార్థులకు రెమిడియల్‌ తరగతులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. కానీ విద్యార్థులు ఇద్దరు ముగ్గురు కంటే ఎక్కువ రావడం లేదు. చాలా మంది విద్యార్థులు దూరమని హాజరు కాలేదని అధికారులు చెప్తున్నారు. పరీక్షల సమయం దగ్గరపడుతోంది. ఫెయిల్‌ అయిన విద్యార్థులు రెమిడియల్‌ తరగతులను సద్వినియోగం చేసుకొని ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ మహమ్మద్‌ గౌస్‌ సూచించారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



అనంతను కలసిన పార్టీ అనుబంధ విభాగాల నాయకులు

అనంతపురం కార్పొరేషన్‌: వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. ఇటీవల పార్టీ అనుబంధ విభాగాలకు సంబంధించి పలువురికి అధిష్టానం వివిధ హోదాలను కల్పించిన విషయం విదితమే. దీంతో పదవులు పొందిన వారు జిల్లా అధ్యక్షుడు అనంత ఇంటికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పార్టీలో తమకంటూ గుర్తింపు ఇచ్చినందుకు సంతోషంగా ఉందని, అధిష్టానం ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు పని చేస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు కావస్తోందని, కానీ ఇంత వరకు సూపర్‌ సిక్స్‌ హామీలను అమలు చేయలేదని అన్నారు. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ విప్లవం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో పాటు సంక్షేమం ఆగిపోయిందన్నారు. ప్రజల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కనువిప్పు కల్గించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్‌ రిజ్వాన్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఓబిరెడ్డి, శ్రీదేవి, అమర్‌నాథ్‌రెడ్డి, మల్లెమీద నరసింహులు, సైపుల్లాబేగ్‌ తదితరులు పాల్గొన్నారు.

హాకీ అకాడమీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామానికి చెందిన ముగ్గురు హాకీ క్రీడాకారులు వివిధ హాకీ అకాడమీలకు ఎంపికైనట్లు సనప ఉన్నత పాఠశాల పీడీ నాగరాజు తెలిపారు. లక్ష్మి అనే విద్యార్థి భోపాల్‌లోని జాతీయస్థాయి హాకీ అకాడమీకి, స్వీటీ అనే విద్యార్థి హైదరాబాద్‌లోని స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా అకాడమీకి, మంజూషా అనే విద్యార్థి ఎస్‌ఆర్‌ఎమ్‌ చెన్నైకి ఎంపికై నట్లు పేర్కొన్నారు. ముగ్గురు 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకూ సనప ఉన్నత పాఠశాలలో చదివారన్నారు. లక్ష్మి కర్ణాటకలోని మడికెర స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ హాస్టల్‌లో శిక్షణ పొందుతుందన్నారు. అలాగే స్వీటి, మంజూషా అనంతపురం ఆర్డీటీ అకాడమిలో శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. అకాడమీకి ఎంపికైన విద్యార్థులు అంతర్జాతీయ హాకీ పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు.

బీచ్‌ కబడ్డీ పోటీల్లో ప్రతిభ

తాడిపత్రిటౌన్‌: రాష్ట్ర స్థాయి బీచ్‌ కబడీ పోటీల్లో తాడిపత్రి క్రీడాకారులు గౌతమి, సుహానా అత్యంత ప్రతిభకనబరిచినట్లు సాయిచైతన్య స్కూల్‌ అండ్‌ అకాడమీ కోచ్‌ లక్ష్మీనరసింహ సోమవారం తెలిపారు. ఈ నెల 4న కాకినాడలో ఆంధ్ర కబడ్డీ ఆసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి బీచ్‌ కబడీ పోటీల్లో గౌతమి జిల్లా జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారన్నారు. పోటీల్లో గౌతమి, సుహనా ప్రతిభ కనబరిచి జట్టును మూడోస్థానంలో నిలిపారన్నారు. గౌతమి నేషనల్‌ క్యాంపునకు సెలెక్ట్‌ అయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్‌: పట్టణ శివార్లలోని నేమతాబాదు జగనన్న కాలనీ సమీపంలో సోమవారం ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రమేష్‌ తన వదిన భీమక్క అనారోగ్యంతో ఉండటంతో గుంతకల్లులో వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకెళ్లాడు. చికిత్స అనంతరం తిరిగి వస్తుండగా చెరువు కట్ట దగ్గర గుత్తి నుంచి గుంతకల్లు వైపు వెళ్తున్న ఆటో ఎదురుగా వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో రమేష్‌, భీమక్క తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

మిద్దెపై నుంచి పడి యువకుడికి గాయాలు

గుత్తి రూరల్‌: పట్టణంలోని జెడ్‌.వీరారెడ్డి కాలనీలో ఇంటిపై నుంచి పడి సుధాకర్‌ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. జెడ్‌. వీరారెడ్డి కాలనీకి చెందిన సుధాకర్‌ ఆదివారం రాత్రి ఇంటిపై నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో నిద్రమత్తులో మూత్రవిసర్జన కోసం వెళ్తూ మిద్దెపై నుంచి జారి కిందకు పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రీవెన్స్‌లో సెల్‌ఫోన్‌తో కాల క్షేపం!



గ్రీవెన్స్‌లో సెల్‌ఫోన్లు చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్న పలు శాఖల అధికారులు

యల్లనూరు మండలంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అధికారులు సెల్‌ ఫోన్‌ చూస్తూ సాక్షి కెమెరాకు చిక్కారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన ఉద్యోగులు ఇలా సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేయడాన్ని పలువురు తప్పుపట్టారు. ఇలాగైతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రజలు, రైతులు చర్చించుకుంటున్నారు. కాగా 16 శాఖలు ఉండగా కేవలం ఐదారు శాఖల అధికారులు మాత్రమే హాజరుకావడం గమనార్హం. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ జేఈ సుప్రజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ రాజామణి, హౌసింగ్‌ ఏఈ సుప్రజ, హెల్త్‌ సూపర్‌వైజర్‌ నూర్జహాన్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ తుకారామ్‌ నాయుడు, ఏపీఎం ముత్యాలప్ప, ఎమ్మార్వో సిబ్బంది ప్రదీప్‌ పాల్గొన్నారు.

ఆత్మకూరు ఎస్‌ఐగా లక్ష్మణరావు



ఆత్మకూరు: ఆత్మకూరు నూతన ఎస్‌ఐగా లక్ష్మణరావు బాధ్యతలను సోమవారం స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన లక్ష్మీనారాయణ బదిలీపై వెళ్లారు. అనంతపురం నుంచి ఆత్మకూరుకు బదిలీపై వచ్చినట్లు లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ముందస్తు అడ్మిషన్లు నివారించాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్‌: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్‌, కార్పొరేట్‌ విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు, ఫీజుల దోపిడీ, పుస్తకాల వ్యాపారాలను అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే కార్పొరేట్‌ విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సంస్థల పేర్లతో పుస్తకాలు ముద్రించి విక్రయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్పొరేట్‌ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, సహాయ కార్యదర్శి చందు, నగర అధ్యక్షుడు మంజునాథ్‌, కోశాధికారి నాని తదితరులు పాల్గొన్నారు.

అనంత నృత్యకారిణికి అరుదైన గౌరవం



సత్కారమందుకుంటున్న సంధ్యామూర్తి

అనంతపురం కల్చరల్‌: జిల్లాకు చెందిన ప్రముఖ నాట్యాచార్యులు గుంటూరు సంధ్యామూర్తి మరో అరుదైన గౌరవం అందుకున్నారు. పశ్చిమ బెంగాల్‌ రాష్ట్రం డార్జిలింగ్‌ వేదికగా కల్చరల్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ ఫెడరేషన్‌ వారు 8వ 'జాతీయ డ్యాన్స్‌ అండ్‌ మ్యూజిక్‌ చాంపియన్‌షిప్‌-25'ను నిర్వహించారు. ఇందులో పలు రాష్ట్రాల కళాకారులు పోటీ పడ్డారు. ఈ పోటీలకు సంధ్యామూర్తి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అలాగే శాస్త్రీయ నృత్యంలోని మెలకువలను స్వయంగా అభినయించి కళాకారులను ప్రోత్సహించారు. చివరిరోజు సంధ్యామూర్తిని నిర్వాహకులు ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందించారు.